## వైరా ఏరియా ఆసుపత్రికి మహర్దశ

**100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీ**

**అన్ని విభాగాలకు 134 పోస్టులు మంజూరు**

ఖమ్మం సిటీ, అక్టోబర్ 5: జిల్లాలో వైద్యరంగం ఎప్పటికప్పుడు కొత్తపుంతలు తొక్కుతూనే ఉన్నది. సీఎం కేసీఆర్ సహకారంతో వైద్యారోగ్యశాఖతోపాటు వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు మహర్దశ పట్టింది. తాజాగా వైరా ఏరియా ఆసుపత్రి 100 పడకల దవాఖానగా రూపాంతరం చెందనుంది. ఈమేరకు గురువారం తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 30 పడకలతో మాత్రమే సేవలు అందిస్తుండగా సర్కారు చొరవతో పెద్దాసుపత్రుల జాబితాలోకి వెళ్లనున్నది. జిల్లా సార్వజనీన ఆసుపత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పాటు అయినందున డీఎంఈ పరిధిలోకి వెళ్లిన సంగతి తెలిసిందే. జిల్లాలో మధిర, సత్తుపల్లి పట్టణాల్లో మాత్రమే 100 పడకల సామర్థ్యం కలిగిన దవాఖానలు ఉన్నాయి. ఇక నుంచి వైరా సైతం వాటి సరసన చేరనున్నది. దీంతోపాటు దవాఖానకు అవసరమైన వసతుల కల్పన, వైద్యులు, ఇతర సిబ్బందిని సైతం కేటాయిస్తూ జీవో ఇవ్వడం గమనార్హం. అనుభవం, ఇతర అర్హతల ప్రాతిపదికన తక్షణం నియామకాలు చేపట్టాలంటూ జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. కాగా.. వైరాను వంద పడకల ఆసుపత్రిగా చూడాలన్నది స్థానిక ప్రజల ఆకాంక్ష. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఉత్తర్వులు వారి చిరకాల కోరికను నెరవేర్చిందని వైద్య యంత్రాంగం వ్యాఖ్యానిస్తున్నది.

**అవసరమైన వైద్యులు, సిబ్బంది..**

సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (9), సివిల్ సర్జన్ ఆర్ఎంవో (1), సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డెంటల్ (1), డిప్యూటీ సివిల్ సర్జన్స్ (4), సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ (23), డెంటల్ అసిస్టెంట్ సర్జన్ (1), నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 (1), అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ (1), ఫార్మసీ సూపర్‌వైజర్ (1), హెడ్ నర్స్ (4), ఆఫీస్ సూపరింటెండెంట్ (1), స్టాఫ్ నర్స్ (26), ఫార్మసిస్ట్ గ్రేడ్-1 (3), ఫిజియో థెరపిస్ట్ (1), రేడియోగ్రాఫర్ (2), సీనియర్ అసిస్టెంట్ (2), ల్యాబ్ టెక్నీషియన్స్ (4), హెల్త్ సూపర్‌వైజర్ (1), ఏఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫిమేల్ (2), ఫార్మసిస్ట్ గ్రేడ్-2 (2), జూనియర్ అసిస్టెంట్స్ (5), ఓటీ, థియేటర్ అసిస్టెంట్ (3) కలిపి మొత్తం 98 పోస్టులు మంజూరయ్యాయి.

**సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు..**

మాతా, శిశు సంరక్షణ విభాగానికి సంబంధించి గైనకాలజీ (2), పిడియాట్రిక్ (2), ఎనస్తీషియా (2), జనరల్ సర్జన్ (1), జనరల్ మెడిసిన్ (1), రేడియాలజీ (1) కలిపి మొత్తం 9 పోస్టులు భర్తీ చేయనున్నారు.

**డిప్యూటీ సివిల్ సర్జన్స్**

ఆప్తమాలజీ (1), ఆర్థోపెడిక్ (1), జనరల్ సర్జన్ (1), జనరల్ మెడిసిన్ (1) కలిపితే మొత్తం నాలుగు పోస్టులు..

**సివిల్ అసిస్టెంట్ సర్జన్స్**

గైనకాలజీ (4), పిడియాట్రిక్ (3), ఎనస్తీషియా (3), జనరల్ సర్జన్ (1), జనరల్ మెడిసిన్ (1), ఆప్తమాలజీ (1), ఆర్థోపెడిక్స్ (1), ఈఎన్‌టీ (1), డెర్మటాలజీ (1), సైకియాట్రిక్ (1), పల్మనాలజీ (1), పాథాలజీ (1), జీడీఎంవో (4) కలిపి మొత్తం 23 పోస్టులు

**వైరాకు ఖమ్మం పెద్దాసుపత్రి యంత్రాంగం..?**

జిల్లా సార్వజనీన ఆసుపత్రికి అనుసంధానంగా తెలంగాణ ప్రభుత్వం మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. గత నెలలో సీఎం కేసీఆర్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం తరగతులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఆసుపత్రిని మెడికల్ కళాశాలకు అప్పగించాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీనిలో భాగంగా డీఎంఈ పరిధిలోని సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టులనూ భర్తీ చేయగా వారు వచ్చారు. వైద్యుల స్థానంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాఠాలు బోధిస్తారు. ఇప్పటివరకు వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్న యావత్ యంత్రాంగం విధిగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటన్నింటినీ గుర్తించిన ప్రభుత్వం ఖమ్మానికి 25 కిలో మీటర్ల దూరంలోని వైరా ఏరియా ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసింది. అవసరమైన సీనియర్ వైద్యులను తీసుకోవాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్న కారణంగా జిల్లా సార్వజనీన ఆసుపత్రికి చెందిన వారు అక్కడికే వెళ్లేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలిసింది. ఒక మెడికల్ సూపరింటెండెంట్, ముగ్గురు ఆర్ఎంవోలు, వైద్యుల పరంగా ఏవో, పరిపాలనకు మరో ఏవో, స్పెషలిస్ట్ వైద్యులు అందరూ వైరా ఏరియా దవాఖానాలో బాధ్యతలు తీసుకోనున్నారని విశ్వసనీయ సమాచారం.

# 16న లాభాల వాటా

- చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సింగరేణి యాజమాన్యం
- దసరా కానుకగా రూ.711.18 కోట్లు
- సీఎం కేసీఆర్ ఆదేశంతో నిధుల విడుదల
- సగటున ఒక్కో కార్మికుడికి రూ.1.53 లక్షల బోనస్
- సంస్థచరిత్రలో అత్యధికంగా 32 శాతం చెల్లింపులు: సంస్థ సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 5: సింగరేణి బొగ్గు ఉత్పాదక సంస్థ కార్మికులకు దసరా కానుకగా లాభాల వాటా రూ.711.18 కోట్లను ఈ నెల 16న చెల్లించనున్నట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ వెల్లడించారు. రాష్ట్రముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రకటించిన విధంగా గతేడాది సంస్థ సాధించిన రూ.2222.46 కోట్లలో 32 శాతం లాభాల బోనస్‌ను దసరా పండుగకు వారం రోజుల ముందే చెల్లిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ.1.53 లక్షల వరకు బోనస్ అందనుందని తెలిపారు. సింగరేణి సంస్థను లాభాల దిశగా నడిపిస్తున్న కార్మికులకు గతంలో కన్న ఎక్కువ శాతాన్ని లాభాల వాటా ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు సింగరేణి ఉద్యోగుల తరపున సీఎండీ శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. బోనస్ చెల్లింపుపై డైరెక్టర్ (పా) బలరాం గురువారం సర్క్యులర్‌ను జారీ చేశారు. దేశంలో మరే ఇతర బొగ్గు కంపెనీల్లో లేని విధంగా సింగరేణి సంస్థ ప్రతి ఏడాది తనకు వచ్చిన నికర లాభాల్లో కొంత శాతం వాటాను లాభాల బోనస్‌గా కార్మికులకు పంచుతున్నది. తెలంగాణ రాకముందు 2013-14లో ఇది 20 శాతం ఉండగా ఆవిర్భావం తర్వాత దీనిని పెంచుతూ 2014-15లో 21 శాతం చేశారు. తాజాగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో సంస్థ సాధించిన నికర లాభాల్లో 32 శాతం లాభాల బోనస్‌గా కార్మికులకు చెల్లించాలని సీఎం కేసీఆర్ ఇటీవలే ఆదేశించారు. దసరా పండుగకు ముందే ఇది కార్మికుల చేతికి అందేలా చూడాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం పూర్తి ఏర్పాట్లను చేసింది.



సీఎండీ శ్రీధర్

గత ఆర్థిక సంవత్సరంలో విధులు నిర్వహించిన 46,326 మంది సింగరేణి ఉద్యోగులకు 32 శాతం వాటాగా కేటాయించిన రూ.711.18 కోట్లను వారు పనిచేస్తున్న గని, శాఖ ఆధారంగా బోనస్‌ను లెక్కించి చెల్లించనున్నారు. ప్రధానంగా ఎక్కువ హాజరు ఉన్న వారికి ఎక్కువ మొత్తంలో లాభాల బోనస్ దక్కనుంది. భూగర్భ గని ఉద్యోగులకు రోజుకు రూ.749.58 చొప్పున వారు పనిచేసిన మొత్తం దినాలకు లెక్కగట్టి బోనస్ చెల్లిస్తారు. ఓపెన్‌కాస్ట్ గనులు, ఇతర సర్ఫేస్ శాఖల్లో పనిచేసే వారికి రూ.627.41 చొప్పున చెల్లిస్తారు. వీరు కాక మిగిలిన విభాగాలు, శాఖల్లో పనిచేసే వారికి రోజుకు రూ.578.69 చొప్పున వారు పనిచేసిన దినాలకు లెక్కకట్టి బోనస్ చెల్లింపులు ఉంటాయి. మొత్తం మీద చూస్తే సగటు న ఒక్కో కార్మికుడికి రూ.1,53,516 వరకు లాభాల బోనస్ పొందే అవకాశం ఉంది.

**స్వరాష్ట్రంలోనే అత్యధిక టర్నోవర్, లాభాలు**

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, సీఎం కేసీఆర్ దిశానిర్దేశంతో సింగరేణి సంస్థ తొమ్మిదేళ్ల కాలంలో అద్భుతమైన ప్రగతిని సాధించింది. సంస్థ సీఎండీ శ్రీధర్ సామర్థ్యం, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా తెలంగాణ రాకపూర్వంతో పోలిస్తే లాభాల్లో 421 శాతం వృద్ధి, అమ్మకాల్లో 176 శాతం వృద్ధిని సాధించింది. 2013-14లో రూ.11,928 కోట్ల టర్నోవర్ సాధించిన సంస్థ, ఏటా వృద్ధి చెందుతూ 2022-23లో రూ.33,065 కోట్ల టర్నోవర్‌కు ఎదిగింది. అలాగే నాడు రూ.419 కోట్ల లాభాలను సాధించిన సంస్థ నేడు రూ.2222 కోట్ల లాభాలను ఆర్జించగలిగింది. ఉద్యోగులు బాగా పనిచేసిన కారణంగానే అద్భుతమైన వృద్ధి సాధ్యమైందని, చరిత్రలో అత్యధికశాతం లాభాల వాటాను కార్మికులు అందుకోగలిగారని సీఎండీ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ ఏడాదికి నిర్దేశించుకున్న వార్షిక ఉత్పత్తి లక్ష్యం 720 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణాను సాధించగలిగితే, సంస్థ గతేడాది కన్నా మిన్నగా రూ.3500 కోట్ల లాభాలను సాధించే అవకాశం ఉందని, ఫలితంగా మరింత సంక్షేమంతో పాటు ఇప్పటికన్నా ఎక్కువ లాభాల వాటా బోనస్‌ను పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు తన పని గంటలను, యంత్రాల పనిగంటలను పూర్తి స్థాయిలో వినియోగిస్తూ ఉత్పాదకత, ఉత్పత్తి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు.

**సహకరించిన వారికి కృతజ్ఞతలు**

రెబ్బెన, అక్టోబర్ 5: సంస్థ సాధించిన లాభాల నుంచి రూ.711.18 కోట్లు ఉద్యోగులకు ఈ నెల 16న చెల్లించడానికి సింగరేణి యాజమాన్యం నిర్ణయించిందని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరంలో 100 మస్టర్లు చేసిన ప్రతి కార్మికుడికీ లాభాల వాటా డబ్బులు వస్తాయని తెలిపారు. సింగరేణి కార్మికులకు లాభాలవాటా పెంచి ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్, సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ అగ్ర నాయకత్వానికి బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్, సింగరేణి ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## సత్తుపల్లికి ప్రత్యేకాధికారుల నియామకం

**దళితబంధు అర్హుల ఎంపికకు గ్రామసభలు**

**సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు**

**తెలిపిన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**



ఖమ్మం, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సత్తుపల్లి నియోజకవర్గంలో దళితబంధును పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. నియోజకవర్గానికి దళితుబంధును ప్రకటించిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో ప్రత్యేకాధికారులను కేటాయించి గ్రామాల్లో శుక్రవారం నుంచి అమలుపరిచే దిశగా సభలు నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించి దళితుల స్థితిగతులపై ఆరా తీస్తారని తెలియజేశారు. నియోజకవర్గంలో దళితబంధు ప్రక్రియ వేగవంతం చేసే విధంగా సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల ఎమ్మెల్యే సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక మండలాధికారులు.. ప్రత్యేకాధికారులకు అందుబాటులో ఉండి సహకరించాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోరారు.

## 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ



ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 5: జాతీయ స్థాయి ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైడ్ ఇన్ మ్యాథ్‌మేటిక్స్ పరీక్షలో నగరంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ శర్మ తెలిపారు. ప్రతిభ కనబరిచిన పలువురు 9, 10వ తరగతి విద్యార్థులను గురువారం డీఈవో సోమశేఖరశర్మ, సెక్టోరల్ అధికారులు, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, డీన్ రాజశేఖరరెడ్డి, డీజీఎం చేతన్‌మాధుర్ అభినందించారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

రఘునాథపాలెం, అక్టోబర్ 5: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కేవీ బంజర, పంగిడి, దొనబండ, రజబ్‌అలీ నగర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో గ్రామాలకు రూ.లక్ష నిధులు రావాలంటే గగనంగా ఉండేదని, తెలంగాణ ప్రభుత్వంలో ఒక్కో గ్రామానికి రూ.కోట్ల నిధులతో అభివృద్ధి జరుగుతోందన్నారు. సాగుకు మూడు గంటల కరెంటు సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్న మాటల్లోనే కాంగ్రెస్ కుటిల బద్ధి ఏమిటో అవగతం అవుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భుక్యా గౌరి, జడ్పీటీసీ మాళోతు ప్రియాంక, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీర వీరూనాయక్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సర్పంచ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న మంత్రి పువ్వాడ

## క్రమశిక్షణతో పనిచేయాలి

- జీఎం పర్సనల్ బసవయ్య
- 'కారుణ్య' పత్రాలు అందజేత

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 5: సింగరేణి సంస్థలో ఉద్యోగం సాధించిన వారు నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేయాలని జీఎం పర్సనల్ కే.బసవయ్య సూచించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తూ మెడికల్ ఇన్వాలిడేట్ అయిన కార్మికుల పిల్లలకు గురువారం కారుణ్య నియామక పత్రాలు అందించారు. ఉన్నతాధికారుల సూచనలు, రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. విధులకు గైర్హాజరు కాకుండా సంస్థ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పర్సనల్ కే.శ్రీనివాసరావు, డీవైపీఎంలు సుశీల్‌కుమార్, జీకే కిరణ్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ పీఏ వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్లు అజీజ్, స్వప్ననీల్, సింధుశ్రీ పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం పర్సనల్ బసవయ్య

## డిస్మిస్డ్ కార్మికులకు మరో అవకాశం

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 5: సింగరేణి సంస్థలో పనిచేస్తూ జనవరి 2019 నుంచి డిసెంబర్ 2022 వరకు విధులకు గైర్హాజరై, డిస్మిస్ అయిన మాజీ ఉద్యోగులను తిరిగి కంపెనీలోకి తీసుకునేందుకు తెలిపిన ప్రమాణాలు కలిగిన వారిని హైపవర్ కమిటీ రివ్యూ చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని జీఎం పర్సనల్ (ఐఆర్, పీఎం) బీ హనుమంతరావు వెల్లడించారు. అనధికారికంగా గైర్హాజరైనందుకు డిస్మిస్ అయిన మాజీ ఉద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని బదిలీ వర్కర్ కేటగిరి 1 నియామకం కోసం సంస్థ తెలిపిన ప్రమాణాలను కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్మికులు ఏప్రిల్ 1, 2023 నాటికి 46 ఏండ్లు, అంతకంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని, డిస్మిస్ అయిన కాలానికి ముందు ఐదేళ్లలో ఏదైనా రెండేళ్లు కనీసం వంద మస్టర్లు కలిగి ఉండాలని తెలిపారు. బదిలీ వర్కర్ అండర్‌గ్రౌండ్ క్యాట్1గా తిరిగి నియామకం కోసం మెడికల్ ఫిట్‌నెస్ కలిగి ఉండాలని చెప్పారు. ఈ నెల 31వ తేదీ లోపు డిస్మిస్ కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.